

భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 25.0
తణుకు : 30.0 - 25.0



నిత్యావసరాల ధరలకు రెక్కలు

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న చందాన విజయవాడలో వరదలు వస్తే పశ్చిమ గోదావరిలో నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలు వచ్చాయి. వరదల కారణంగా రవాణా సదుపాయం లేక ఎగుమతులు, దిగుమతులు తగ్గాయి. ఫలితంగా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వారం రోజుల్లో నిత్యావసర ధరలు పది శాతం పెరగ్గా బియ్యం ధరలు నాణ్యతను బట్టి క్వింటాల్‌కు వంద నుంచి 200లకు పెరిగింది. కూరగాయలు అదే బాటలో ఉన్నాయి.

- వారం రోజుల్లో పది శాతం పెరుగుదల
- జిల్లా కేంద్రం భీమవరంలో స్టాక్ నిల్
- కూరగాయల ధరలు 50 శాతం పెరుగుదల
- ఒక వైపు వర్షాలు.. మరో వైపు ధరలు
- సామాన్యులు విలవిల

పాలకొల్లు, సెప్టెంబరు 6: వాస్తవానికి పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, వంటి ప్రధాన వాణిజ్యకేంద్రాల్లో నిత్యావసరాలు అయిన కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, పంచదార, గోదుమ, ఇడ్లి రవ్వ, ఇటువంటి వస్తువులు హోల్‌సేల్ వర్తకుల వద్ద నాలుగు నెలలు చిల్లర అమ్మకాలకు సరిపడా ఉండాయి. అయితే వారం పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు రవాణా నిలిచిపోవడంతో సరుకు నిల్వలు అయిపోయాయని హోల్‌సేల్ వర్తకులు చెబుతున్నారని తప్పనిసరి పరిస్థితిల్లో కొంత మేరకు ధర పెంచాల్సి వస్తుందని రిటైల్ కిరాణా వర్తకులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో ఇటీవల బియ్యం వినియోగం గణనీయంగా తగ్గింది. అధికశాతం ప్రజలు ఒక పూటకే రైస్ పరిమితం చేసి రెండవ పూట అల్పాహారం తీసుకుంటుండటంతో బియ్యం అమ్మకాలు గత దశాబ్ద కాలంలో మూడింట ఒక వంతు తగ్గాయి. అమ్మకాలు అంతంతమాత్రంగా ఉన్నప్పటికి హోల్‌సేల్ వర్తకులు బియ్యం ధరలు ఒక్కసారిగా పెంచేశారు. దీంతో సామాన్య ప్రజలు అధిక ధరలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇపుడు రిటెల్ మార్కెట్‌లో కిలోబియ్యం నాణ్యతను బట్టి 40 నుంచి 60 రూపాయలు ఉంది. టోకు వ్యాపారంలో ధరలు పెరగడంతో చిల్లరగా కొనుగోలు చేసుకునే వినియోగదారులకు కిలోకు అదనంగా 2 నుంచి 3 రూపాయలు భారం పడుతుంది. మరో వైపు ఇడ్లి రవ్వ, గోధుమ, నూకధరలు నాలుగు రోజులు వ్యవధిలో కిలోకు 25 రూపాయలు పెరిగింది. జిల్లా కేంద్రం భీమవరంలో హోల్‌సేల్ నిల్వలు అయిపోయాయని చెబుతున్నారు. మరో వైపు ఏలూరు జిల్లా కేంద్రంలో ధరలు అధికమయ్యాయి. ఉమ్మడి జిల్లా నుంచి వరద ముంపు ప్రాంతమైన విజయవాడకు నాలుగు రోజులుగా వందలాది వాహనాల్లో ఆహారం, పాలు, వాటర్‌బాటిల్స్ పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా పాలకొల్లు, తణుకు, భీమవరం, నిడదవోలు పట్టణాల్లో పలువురు వర్తకులు కృత్రిమ కొరత సృష్టిస్తూ నిల్వలు అయ్యిపోయాయంటూ ధరలు పెంచుతున్నారు.

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,2 నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు నిల్వ చేసుకుంటారు. ఇపుడు వినాయక చవితి సందర్భంగా అమ్మకాలు పెరిగాయి. అయితే పది రోజులకు ముందు రూ.1000 అయ్యే కిరాణా బట్టి ఇపుడు 1100 అవుతుందని వాపోతున్నారు.

చుక్కల్లో కూరగాయల ధరలు

మరోవైపు కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. మొన్నటి వరకు కిలో 40 రూపాయలు ఉన్న కూరగాయల ధర ఇపుడు 60కి చేరింది. బీర, బెండ, వంగ, టమోటా వంటి కూరగాయలు కిలో 60 రూపాయలు పై బడి ధర పలుకుతుంది. భారీ వర్షాలు వరద తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. లంక ప్రాంతల్లోనూ కూరగాయలు అధికంగా సాగు చేసే ఏజెన్సీ ప్రాంతాల్లో వందలాది ఎక్కురాల్లో కూరగాయలు తగ్గుతున్నాయి. మరో వైపు దూర ప్రాంతాల నుంచి రవాణాకి వరదలు అంతరాయం కలిగిస్తున్నాయి. పలు ప్రధాన హైవేలు, స్టేట్‌హైవేలు, వరదలకు గండ్లు పడటంతో రవాణా నిలిచింది. దీంతో స్థానికంగా ప్రతి కూరగాయలకు డిమాండ్ పెరిగింది. కూర అరటి కాయలు జత మొన్నటి వరకు పది రూపాయలు అమ్మగా ఇపుడు 20కి అమ్ముతున్నారు. మునగకాడలు రెండు 30, ఉల్లి ధర కిలో 50 దాటింది. ఆలుగడ్డలు పరిస్థితి అదేవిధంగా ఉంది. మరో వైపు కార్మిక కర్షకవర్గాలకు పది రోజులగా ముసురు పట్టడంతో పనులు లేక ఆదాయం లేక సామాన్యులు పూట గడవని పరిస్థితిలో విలవిల్లాడుతున్నారు.



ఆర్ఎస్‌కు మాజీ ఎమ్మెల్సీ అంగర నివాళి

ఆర్ఎస్‌కు కన్నీటి వీడ్కోలు

7

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

జిల్లాలో 24 డెంగీ, రెండు చికెన్ గున్యా కేసులు

ఆకివీడు రూరల్ సెప్టెంబరు 6 : ఈ ఏడాది జనవరి నుంచి జిల్లాలో 24 డెంగీ, రెండు చికెన్ గున్యా కేసులు నమోదు అయ్యాయని జిల్లా వైద్యాధికారి ఉమా మహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కళింగపాలెంలో జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుంపగడప గ్రామంలో 26 మందికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి చికెన్ గున్యా సోకినట్లు తెలిపారు. ప్రజలందరూ శానిటేషన్ పట్ల శ్రద్ధ వహించాలని, వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉన్నాయని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

మార్కెట్‌లో చవితి సందడి

ఆకాశాన్నంటిన పూలు, పండ్ల ధరలు



కాళ్ళలో విక్రయానికి సిద్ధం చేసిన గణనాథుల విగ్రహాలు



నరసాపురంలో పూజా సామగ్రి కొనుగోలుదారులతో నిండిపోయిన రహదారి

జిల్లాలో వినాయక చవితి సందడి నెలకొన్నది. శుక్రవారం పూజా సామగ్రి కొనుగోలుదారులతో అన్ని ప్రాంతాల్లో రోడ్లన్నీ కిక్కిరిశాయి. పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. అరటి పండ్లు డజన్ రూ.60 నుంచి రూ.80, వెలక్కాయ రూ.50, జొన్నకండి రూ.30, చెరుకు రూ.20, తామర పువ్వు రూ.20కు అమ్మారు. పెరిగిన ధరలతో జనం షాక్ అయ్యారు. ముఖ్య కూడళ్ళలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.

నిలకడగా గోదావరి వరద

ముంపులోనే కనకాయలంక కాజ్ వే



ఆకివీడు ఉప్పుటేరు వంతెన వద్ద కలెక్టర్ నాగరాణి ప్లాన్ పరిశీలన



నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి



ఆకివీడు సమీపంలో ఉప్పుటేరులో కలిసిన కొల్లేరు వరద

ఆచంట/యలమంచిలి/నరసాపురం, సెప్టెంబరు 6: గోదావరి వరదనీటి ప్రవాహం శుక్రవారం నిలకడగా ఉంది. ఆచంటలో పుష్కరఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నాటు పడవల రాకపోకలు నామమాత్రంగా తిరుగుతున్నాయి. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్ వే రెండో రోజు వరదనీటి ముంపులోనే ఉంది. దీంతో కాజ్ వే వద్ద గ్రామస్తులు రాకపోకలు పడవలపైనే కొనసాగించారు. గోదావరి వరద నేపథ్యంలో లంకగ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. కనకాయలంక కాజ్ వే వద్ద గోదావరి వరద పరిస్థితిని జేసీ శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో బైక్‌పై తిరిగి ప్రజలతో మాట్లాడారు. వరద కారణంగా నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య రెండో రోజు శుక్రవారం రాకపోకలు నిలిచి పోయాయి. ఎగువ నుంచి దాదాపు 3 లక్షల క్యూసెక్కు ల నీరు సముద్రంలోకి వస్తుండటంతో నరసాపురం వద్ద వశిష్ఠ పరవళ్లు తొక్కుతున్నది. మత్స్యకారులు వేటకు వెళ్ళడం లేదు. వలంధర్‌రేవును మూసివేశారు.

అడ్డంకులు తొలగించాలి : కలెక్టర్లు

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 6 : కొల్లేరులోకి వచ్చే వరద నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్ళేందుకు ఉన్న అన్ని అడ్డంకులు తొలగించాలని అధికారులను పశ్చిమ, ఏలూరు జిల్లాల కలెక్టర్లు నాగరాణి, వెట్రి సెల్వీ ఆదేశించారు. శుక్రవారం ఉప్పుటేరు రోడ్డు వంతెనను, బైపాస్ రోడ్డు కోసం నిర్మాణంలో ఉన్న వంతెన అప్రోచ్‌రోడ్డును, రైల్వే వంతెనను వారు పరిశీలించారు. కొల్లేరు నుంచి ఎన్ని క్యూసెక్కులు నీరు వస్తుంది, ఉప్పుటేరు నీటి ప్రవాహమెంత అని డ్రెయినేజీ అధికారులను వివరాలు అడిగారు. ఉప్పుటేరులో పేరుకుపోయిన కిక్కసను, అప్రోచ్ రోడ్డును యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని డ్రెయినేజీ అధికారులు ఆదేశించారు. ఆ తర్వాత ఉప్పుటేరులో బైపాస్ వంతెన కోసం నిర్మించిన అప్రోచ్ రోడ్డును జిల్లా కలెక్టర్లు వెళ్ళిన అనంతరం ఎక్స్‌కవేటర్లతో తొలగించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉప్పుటేరుపై రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశీలించేందుకు వెళ్ళిన ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ శివకిషోర్‌లకు ప్రమాదం త్రుటిలో తప్పింది. వీరు ఇరువురు ట్రాక్‌పైకి వెళ్ళే సరికి బొకారో ఎక్స్‌ప్రెస్ వచ్చింది. దీంతో రైల్వే సిబ్బంది వారిని అప్రమత్తం చెయ్యడంతో వెంటనే ట్రాక్ పక్కనే ఉన్న స్థలంలోకి దిగిపోవడంతో ప్రమాదం తప్పింది.

పింఛన్‌దారులకు వెసులుబాటు



- ఎక్కడ నుంచైనా తీసుకునే అవకాశం
- ప్రతి నెలా 15లోగా దరఖాస్తు చేసుకోవాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 6: రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారులకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటోంది. ఎక్కడ నుంచైనా పెన్షన్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ సౌకర్యం పొందాలంటే ప్రతి నెలా 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం సంబంధిత వార్డు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలి. ఇప్పటిదాకా మూడు నెలల వరకు పెన్షన్ తీసుకోకపోయినా ఒకేసారి ఇస్తున్నారు. ఆ తర్వాత పెన్షన్ తీసుకోలేని పరిస్థితి ఉంటే గతంలో రద్దు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి తలెత్తకుండా ముందుగా దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. జిల్లాలో 2.34 లక్షల మంది పెన్షన్ దారులున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెంచిన పెన్షన్‌ను తీసు కుంటున్నారు. ప్రతినెలా 1న సచివాలయ సిబ్బందితో పంపిణీ చేస్తున్నారు. ఒకటో తేదీ సెలవు దినమైతే ముందురోజే లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

కొత్త పెన్షన్‌లు ఎప్పుడు

కూటమి ప్రభుత్వం పెన్షన్‌లపై ఎన్నికల్లో పలు హామీలు ఇచ్చింది. అందులో భాగంగానే పెన్షన్‌లు పెంచింది. కొత్త వారు ఇప్పుడు అర్హత సాధించారు. ఇంటిలో ఒకరికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారు. అయితే పెన్షన్ తీసుకునే లబ్ధిదారులు మరణిస్తే ఆ ఇంటిలో అర్హత ఉన్న ఇంకొకరికి పెన్షన్ మంజూరు చేయాలి. ఈ నిర్ణయం తక్షణమే తీసుకోవాలి. ఇప్పటిదాకా సచివాలయాల్లో ఆప్షన్ ఇవ్వలేదు. దానికోసం అర్హులంతా ఎదురుచూస్తున్నారు. లేదంటే అర్హత ఉండీ పెన్షన్ కోల్పోతున్నామన్న ఆందోళన వృద్ధుల్లో వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. కొత్త పెన్షన్‌లపైనా చర్యలు తీసుకోనుంది. అయితే ఎప్పటిలోగా అమలు చేస్తారనే విషయంపై ఇప్పుడంతా ఆశగా చూస్తున్నారు

ముంపు ప్రాంతాలను పర్యవేక్షిస్తుండాలి : కలెక్టర్



చినకాపవరం మురుగు కాల్వ ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఆకివీడు/భీమవరం టౌన్, సెప్టెంబరు 6 : ముంపు ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం రాత్రి నుంచి ఆకివీడు సమతానగర్ ప్రాంతంలో చినకాపవరం మురుగుకాల్వను శుక్రవారం ఆమె పరిశీలించి అధికారులతో మాట్లాడారు. సమీపంలో ఉన్న చెంచులకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకర్ తదితరులు ఉన్నారు. అనంతరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆమె పరిశీలించి తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయ అవతారమెత్తి ఎలా చదువుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనం పథకం మెనూకు సూచనలివ్వాలి..

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలుకు నిర్దిష్టమైన సలహాలు, సూచనలు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు వర్క్‌షాప్‌లో ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ఒక మెనూ సూచించడం జరిగిందని, దానిలో మార్పులు, చేర్పులకు నిర్దిష్టమైన సూచనలు సలహాలు అందజేయాలని అభిప్రాయాలను కోరామన్నారు. డీఈవో జి.నాగమణి, వైద్య ఆరోగ్యశాఖ పీవో ఆర్‌.బి.ఎస్‌.కె ఇన్‌చార్జి డాక్టర్ సీహెచ్.భావన అధికారులు పాల్గొన్నారు.

వరి పొలాలు ఆక్వా చెరువులుగా మార్పిడి

» కేశవరం ఆయకట్టులో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలన

గణపవరం, సెప్టెంబరు 6: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ-పంట నమోదును రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేశవరం ఆయకట్టులో ఈ-పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. వరి సాగులో ఉన్న సుమారు 150 ఎకరాలను ఆక్వా చెరువులుగా ఫిషరీస్ అధికారులు నమోదు చేయడాన్ని ఆయన గుర్తించారు. దీనివల్ల ఈ-పంట ఫలితాలు ఆక్వా రైతులకు లభించవన్నారు. పునఃపరిశీలించి మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. 2022లో పంట పొలాలను ఆక్వా చెరువులుగా నమోదు చేసిన ఫలితంగా రాయితీలు కోల్పోతున్నారని గుర్తించారు. తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఏవో వైవీఎస్ ప్రసాద్, నిడమర్తి కేశవమూర్తి అధికారులు ఉన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ

గణపవరం, సెప్టెంబరు 6: ప్రపంచ వ్యాప్తంగా ఏసుక్రీస్తు బోధనలు ప్రేమ, దయా, కరుణతో ప్రతీ మనిషి జీవితంలో ముందుకు సాగాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. శుక్రవారం గణపవరంలో కల్వరి యాగం ప్రార్థన మందిరంలో 12వ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు.

అక్రమ లే-అవుట్లపై చర్యలు తీసుకోవాలి

నరసాపురం రూరల్, సెప్టెంబరు 6: దర్బరేవు గ్రామంలో జంపన రాంబాబు, సుబ్బరాజు అక్రమ లేఅవుట్లు నిర్మిస్తున్నారంటూ డీఎల్‌పీవో శ్రీనివాస్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. శుక్రవారం సీతారాంపురంలోని డీఎల్‌పీవో కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యను వివరించారు. ఈ అక్రమ లే-అవుట్లలో పంచాయతీ నుంచి తాగునీరు, రహదార్లు, విద్యుత్, పన్నులు వేయకుండా చర్యలు తీసుకోవాలని కొల్లు జయరాజు, కోరిపత్తి శ్రీనివాసు, భూపతి వేణుగోపాల్ విన్నవించారు. లేఅవుట్‌ను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో హామీ ఇచ్చారు.

బాధితురాలికి రూ.80 వేల ఆర్థిక సాయం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 6: ఎల్.అగ్రహారం టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద అగ్నిప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న బాలిక నీలిమకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా రూ.80 వేలు ఆర్థిక సాయం అందించారు. నీలిమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురు విద్యార్థినులకు గీతా స్కాలర్‌షిప్

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులచే ఏర్పాటు చేసిన గీతా స్కాలర్‌షిప్‌ను ఈఏడాది ముగ్గురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున అందించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. స్కాలర్‌షిప్ అందుకున్న వారిలో మూడో సంవత్సరం ఈసీఈ విద్యార్థిని జీవీఆర్ శ్రీదేవి, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని కె.భాను, రెండో సంవత్సరం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని ఎస్.ధనలక్ష్మి ఉన్నారని చెప్పారు.

'పౌష్టికాహారంతోనే ఆరోగ్యం'

పాలకోడేరు/తాడేపల్లిగూడెం రూరల్/అత్తిలి/కాళ్ల/భీమవరం క్రైం, సెప్టెంబరు 6 : గర్భిణులు, బాలింతలకు పూర్తి ఆరోగ్య భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాలకోడేరు మండలం గొరగనమూడి, తాడేపల్లిగూడెంలో సీడీపీవో సరస్వతి ఆధ్వర్యంలో, అత్తిలి మండలం ఆరవల్లి 2, 52వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఎన్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో, కాళ్ల మండలం సీసలిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలో భీమవరం ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు సుబ్బలక్ష్మి నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి డాక్టర్ తీగల రమేష్ రాక

పెంటపాడు, సెప్టెంబరు 7: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 8న విజయవాడ నుంచి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించి అన్ని సమస్యలకు ఉచితంగా వైద్యం చేస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, అల్ట్రా సౌండ్, టూడీ ఎకో, అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరంటౌన్, సెప్టెంబరు 6 :** : డి.భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మన జిల్లాల్లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో గెలుపొందిన పార్లమెంట్ సభ్యులకు, శాసనసభ్యులకు అభినందన గౌరవ ఆత్మీయ సత్కారం ఈనెల 8న నిర్వహిస్తామని చాంబర్ అధ్యక్షుడు బోండాడ రామ్మోహనరావు తెలిపారు.
- **పెంటపాడు** : అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్‌లో సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. విద్యార్థులు గురువులకు పాదపూజ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, హెచ్ఎం కల్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.
- **నరసాపురం రూరల్** : సీతారాంపురం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెంట్రల్ టీమ్ బృంద సభ్యులు ఢిల్లీ నుంచి సెల్‌ఫోన్ సాయంతో ఆస్పత్రి పరిశుభ్రత, మందులు తదితర వాటిని పరిశీలించి సీహెచ్‌వో ఎస్.శారారాణిని అభినందించారు.
- **ఆకివీడు రూరల్** : కొల్లేరులో నీటి ముంపు మరింత పెరిగే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దాపురం, చినిమిల్లిపాడు గ్రామాల్లో పర్యటించిన అనంతరం డీఎస్పీ జైసూర్య అన్నారు. సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజు ఉన్నారు.
- **భీమవరంటౌన్** : జాతీయ అంధత్వ నివారణలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రభుత్వశాఖ విభాగాల్లో ఉద్యోగులకు గొల్లవానితిప్ప నేత్ర వైద్యాధికారి బి.రామకృష్ణ, పోడూరు పీహెచ్‌సీ నేత్ర వైద్యుడు పి.సునీల్ కుమార్, ఆచంట వేమవరం నేత్రవైద్యాధికారి బి.సూర్యనారాయణ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.
- **ఆకివీడు** : ప్రత్యామ్నాయంగా పక్కా గృహాలను నిర్మించకుండా పంపించి పేదల పొట్టకొట్టొద్దని అయి-భీమవరం రోడ్‌లోని కార్మికనగర్‌లోని బాధితులు సీపీఎం నేతలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేసి డీటీ ఫరూఖ్‌కు వినతిపత్రం అందజేశారు.



తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురంలలో గణనాథుల మట్టి ప్రతిమలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి, గొర్రెల శ్రీధర్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తదితరులు

చవితి వేడుకలకు ముస్తాబు

» పట్టణ, గ్రామాల్లో గణనాథుల విగ్రహాల ఏర్పాటు

» ఉచితంగా మట్టి ప్రతిమల పంపిణీ

కాళ్ల/మొగల్తూరు/పెనుగొండ/యలమంచిలి/తాడేపల్లిగూడెం అర్బన్/ఉండి/ఆకివీడు/పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 6 : వినాయక చవితి శనివారం పురస్కరించుకుని పట్టణ, గ్రామాల్లో సందడి ప్రారంభమైంది. గణనాథుడిని ఏర్పాటు చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కాళ్ల మండలంలో కాళ్ల, దొడ్డనపూడి, పెదఅమిరం, జువ్వలపాలెం, కోపల్లె, సీసలి, ఏలూరుపాడు తదితర గ్రామాల్లో చవితి వేడుకలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. మొగల్తూరు మండలంలో మొగల్తూరు, ముత్యాలపల్లి, కాళీపట్నం ప్రధాన కూడలిలో గణనాథుడి మట్టి బొమ్మ, రంగు బొమ్మలను రూ.50 నుంచి 200 వరకు చిన్నసైజు విగ్రహాలను విక్రయించారు. పెనుగొండ మండలంలోని పెనుగొండ భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యలమంచిలి మండలంలోని పలు గ్రామాల్లో మండపాల వద్ద చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలంకరణలు చేశారు. తాడేపల్లిగూడెంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అశ్లీలతకు తావు లేకుండా వేడుకలు జరుపుకో వాలని, పోలీసులు ఉత్సవాలకు ఆటంకం కల్గించరన్నారు. ఉండి మండలం ఉండి సెంటర్‌లో, ఆకివీడు సెంటరులో పలు రకాల పత్రి, పండ్లు, పూలు అమ్మకాలతో సందడి నెలకొంది. గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్న ఆయా కమిటీలు సంప్రదాయాలను పాటించాలని శ్రీక్షీరా రామలింగేశ్వర సేవా సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఉచితంగా మట్టి ప్రతిమల పంపిణీ

తణుకు/భీమవరం ఎడ్యుకేషన్/భీమవరం రూరల్/పెనుగొండ/ఆచంట/గణపవరం/ఉండి/పాలకొల్లు అర్బన్/తాడేపల్లిగూడెం అర్బన్/భీమవరం టౌన్/నరసాపురం/నరసాపురం రూరల్/పెంటపాడు : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తణుకు మైత్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలగర వెంకట కృష్ణ, వావిలాల సరళాదేవి పాల్గొన్నారు. తేతలి జడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు హెచ్ఎంలు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. భీమవరం పట్టణంలోని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో ఉచిత మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశామని కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ సుమారు 300 మట్టి వినాయక విగ్రహాలను పాదచారులకు అందజేశామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు తదితరులు పాల్గొన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్పలో జనసేన యువజన సేవాసమితి అధ్యక్షుడు పోకల కిషోర్ ఆధ్వర్యంలో వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను డీఎస్పీ జయసూర్య పంపిణీ చేశారు. జనసేన రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు, ఎంపీటీసీ రాంబాబు, సీఐ కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకతీయ మెరిట్ స్కూల్ విద్యార్థులు వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే విధానంలో కాలుష్యం కాకుండా ఉండేందుకు అవగాహనకై ఎకో వినాయక ఎగ్జిబిషన్ 2024 ఘనంగా నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 220 మందికిపైగా ప్రతిమలు మట్టి, పిండి పదార్థాలు, ధాన్యాలు, కూరగాయలతో ఆకట్టుకునే విధంగా వినాయక ప్రతిమలను ప్రదర్శించారు. యనమదుర్రు గ్రామంలో మెల్లా సరోజనీ కృష్ణమూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో శివాలయం వద్ద మట్టి గణపతులు, వినాయక వ్రతకల్ప పుస్తకాలను ప్రతి ఏటా మాదిరిగా 200 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. చెన్ను నాగబాబు, గెద్దాడ రాంపండు, మేకల సత్యనారాయణ, జక్కులసాయిరాం, మద్దిరాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. పెనుగొండ మండలం పెనుగొండలోని శ్రీలక్ష్మి ప్రసన్నప్యాన్సీ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆచంట మండలం వల్లూరు సంత మార్కెట్ సెంటర్‌లో మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. చిట్టూరి శ్రీనివాస్, తోట ఆదినారాయణ, ఉరింకి నాగరాజు, కడిమి శ్రీనివాసరావు, కాంపాటి కార్తీక్ పాల్గొన్నారు. గణపవరం మండలం గణపవరంలో ఉత్సవ కమిటీలు, భక్తబృందాలు వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ మండల శాఖ ఆధ్వ ర్యంలో, లయన్స్‌క్లబ్, సప్తనిధి బ్యాంకు ప్రతినిధులు, మానవత సంస్థ ట్రస్ట్, ఇతర సంస్థలు మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఉండి మండలం ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు లయన్ భూపతిరాజు హరినాథ్‌రాజు సౌజన్యంతో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను అందించారు. ఉండి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను అందించారు. పాలకొల్లులోని జీవీఎస్‌బీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 300 మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేశారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చాంబర్స్ డిగ్రీ కళాశాల్లో మట్టి విగ్రహాలనే పూజించాలని ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి రాజరాజేశ్వరి పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 500 మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. తాడేపల్లిగూడెంలో గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ సహకారంతో పట్టణంలోని 14, 17, 19వ వార్డుల్లో ఇంటింటికి వెళ్ళి మట్టి వినాయక ప్రతిమలను, వ్రత పుస్తకాలను అందజేశారు. భీమవరంలో అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ స్కూల్లో విద్యార్థులు మట్టినితో మట్టి విగ్రహాలను తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వ హించారు. స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత, టీచర్లు పాల్గొన్నారు. నరసా పురం బస్టాండ్ సెంటర్‌లో ఆదరణ ట్రస్టు అధ్వర్యంలో ఎమ్మెల్యే నాయకర్ చేతుల మీదుగా సుమారు ఐదు వేల మట్టి విగ్రహాలను అందిం చారు. పట్టణంలోని శ్రీకాశీ విశ్వేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు 10 వేల విగ్రహాలను పంపిణీ చేశారు. నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మట్టి విగ్రహాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడులో ఠిఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్మాగార డైరెక్టర్ ఓపీ గోయెంకా మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

వినాయక చవితి శుభాకాంక్షలు : ఎస్పీ

భీమవరం క్రైం : వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అద్నా న్ నయీం అస్మి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు, పోలీస్‌లకు వారి కుటుంబ సభ్యులకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి : డీఎస్పీ

భీమవరం క్రైం/ఆకివీడు/గణపవరం, సెప్టెంబరు 6 :ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరిగే విధంగా కమిటీ సభ్యులు చర్యలు తీసుకుని, పోలీస్‌వారికి సహకరించాలని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య సూచిం చారు. శుక్రవారం త్యాగరాజు భవన్‌లో భీమవరం వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పె క్టర్లు, మున్సిపల్, రెవెన్యూ, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులతో చవితి ఉత్సవాలకు సంబంధించి సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందడంపై జాగ్రత్తలు, నియమ నిబంధనలుపై అవగాహన కల్పించడానికి ఉత్సవ కమిటీ వారందరికీ సమావేశం నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ అన్ని అనుమతులు పొందిన తరువాతే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజే సౌండ్లు ఉపయోగించరాదన్నారు. రాత్రి పదిగంటల సమయం తరువాత లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదన్నారు. ఉత్సవ రోజుల్లో గాని, నిమజ్జనం రోజున అశ్లీల, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఆకివీడు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో సీఐ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు. గణపవరం పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని టీడీపీ, జనసేన, తదితర నేతలతో జరిగిన సమావేశంలో ఎస్ఐ మణికుమార్ మాట్లాడుతూ గణేషుని విగ్రహాల ఏర్పాటు, పందిళ్ళు, ఊరేగింపులకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు.



కలెక్టర్‌కు విరాళం అందిస్తున్న స్వామి వివేకానంద సేవాసమితి ప్రతినిధులు



తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు విరాళాలు అందజేస్తున్న దాతలు



ఆహార పొట్లాలు విజయవాడ పంపిస్తున్న శశి అధినేత వేణుగోపాలకృష్ణ

వరద బాధితులకు దాతల సాయం

భీమవరంటౌన్, సెప్టెంబరు 6: ఆపత్కాల సమయంలో విజయవాడలోని వరద బాధితుల కోసం మేమున్నామని ముందుకు వస్తున్న దాతలకు కృతజ్ఞతాభినందనలు అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలం పెదఅమిరం స్వామి వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు వేగిరాజు శివవర్మ రూ.5 లక్షలు, పూర్వ జిల్లావాసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని శ్రీగోపీకృష్ణ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కనుమూరి గోపాలరాజు రూ.5 లక్షలు చెక్కులను వారి సహాయకులతో జిల్లా కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం కలెక్టర్‌కు అందించారు. పెనుగొండ మండలం సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.25 వేల చెక్కును డీఈవో జి.నాగమణి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అందించారు. వరద బాధితుల సహాయార్థం భీమవరానికి చెందిన రవీంద్ర శ్రీరామ్ కమర్షియల్ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కృష్ణంరాజు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష చెక్కును కలెక్టర్‌కు అందజేశారు.

- ఉండి/ఆకివీడురూరల్:ఉండి మండలం వాండ్రంకు చెందిన ఏఆర్ ఫిష్ ప్రాడె క్టుకు చెందిన పారిశ్రామికవేత్తలు నారాయణరెడ్డి, బ్రహ్మారెడ్డి శుక్రవారం తహసీల్దార్ నాగార్జునను కలిసి విజయవాడ వరద బాధితులకు రూ. లక్ష చెక్కును అందించారు. ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామ సంఘం రూ.28వేలు విరాళాన్ని డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్‌కు అందజేశారు.

మొగల్తూరు : సీఎం సహాయ నిధికి కొత్తపాలెం సర్పంచ్ లోకం నాగలక్ష్మి ఆమె భర్త కాంట్రాక్టర్ లోకం వెంకటేశ్వరరావు రూ.లక్షా 60వేలు విరాళాన్ని అందించారు. కాంట్రాక్టర్ సంఘం తరపున సేకరించిన నిధులు రూ.లక్ష డీడీని, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ విజయవాడ బాధితులకు కోసం సేకరించిన సహాయం రూ.50 వేలు, కొత్తపాలెం గ్రామస్థులు రూ.10వేలు అందించినట్టు నాని తెలిపారు. మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన లక్కు బాలాజీ రూ.5వేలు స్థానిక తహసీల్దార్ విద్యాపతికి అందించారు.

- ఆచంట : ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు తనయుడు పితాని వెంకట్‌ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని వరద బాధితులకు 44 డివిజన్‌లలో కూరగాయలు, పాలు, పండ్లు, నిత్యావసరుకులు పితాని వెంకట్ చేతుల మీదుగా అందజేశారు. కూటమి సభ్యులు పాల్గొన్నారు.
- పాలకొల్లుఅర్బన్ : పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి 3000 టెట్రా పాల ప్యాకెట్లు, 5000 బిస్కెట్ ప్యాకెట్లు, 2000 రస్కుల ప్యాకెట్లు, 10వేల మంచినీటి ప్యాకెట్లతో పాటుగా పది వేల కొవ్వొత్తుల ప్యాకెట్లు, 10వేలు అగ్గిపెట్టెలను, 500 మెడికల్ కిట్లను లారీ ద్వారా పంపినట్టు తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ తెలిపారు. సీఎస్‌డీటీ ఐవీవీ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు. జనసేన పార్టీ తరపున 20 కేసుల బిస్కెట్ ప్యాకెట్లు, 30 కేసుల టెట్రా పాల ప్యాకె ట్లు, 10 బస్తాల రస్కులను పంపినట్లు జనసేన నాయకులు గవర ఉదయ్ శ్రీనివాస్, తులా రామలింగేశ్వరరావు తెలిపారు.
- తాడేపల్లిగూడెం అర్బన్ : ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపు మేరకు వరద బాధితుల సహాయార్థం శుక్రవారం పలువురు దాతలు క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యేకు విరాళాలు అందజేశారు. మేడపాటి శ్రీనివాసరెడ్డి, తండ్రి చక్రధరరెడ్డి రూ. 2 లక్షలు, ఆరుగొలను జేసీబీ యూనియన్ రూ. లక్ష, మొక్కరాల శ్రీనివాసరావు (ఎంఎస్‌ఆర్) రూ. లక్ష, పడాల బాపిరెడ్డి రూ. లక్ష, టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు రూ. 50,000 , జీవీవీ కృష్ణ రూ 50,000, వర్తనపల్లి కాశి రూ. 25 వేలు, నీలం అయ్యప్ప రూ. 25 వేలు, తిరుపతి కంఠేశ్వరరావు రూ.25 వేలు, కూరపాటి గంగరాజు రూ. 25 వేలు, మారం గిరీష్‌గుప్తా రూ. 25 వేలు, ముత్యాల సత్యనారాయణ రూ. 5 వేలను ఎమ్మెల్యే బొలిశెట్టికి అందజేశారు.
- పాలకొల్లు అర్బన్ : తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం ద్వారా రూ.50వేలు విరాళం అందిం చనున్నట్టు రాష్ట్ర తూర్పు కాపు సంఘ నాయకులు స్థానిక లయన్స్ భవనంలో జరిగిన సమావేశంలో తీర్మానించామని లోపింటి చిరంజీవి తెలిపారు.
- ఆచంట: విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు తనయు డు వెంకట్ ఆధ్వర్యంలో ఆచంట నియోజకవర్గం నుంచి వాటర్ బాటిల్స్, పలు రకాల కూరగాయ లు, బ్రెడ్‌లతో వాహనాన్ని పంపించారు. పితాని వెంకట్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, కేతా మీరయ్య, వెలిచేటి బాబూ రాజేంద్రప్రసాద్, గుడాల శ్రీనివాస్, బొబ్బిలి శ్రీను, మురళి, నాగార్జున పాల్గొన్నారు.



ఉండిలో రూ.లక్ష చెక్కును అందిస్తున్న ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి

వరద బాధితులకు 'శశి' సాయం...

తాడేపల్లిగూడెం రూరల్ : విజయవాడలో వరద బాధితులకు శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో 15 వేల ఆహార పొట్లాల ను విజయవాడ తరలించారు. వేణుగోపాలకృష్ణ దంప తులు స్వయంగా వండించి ఈ ఆహార ప్యా కెట్లను వరద బాధితులకు పంపించారు. గతంలో కూడా ఎర్రకాలువ వరద సమయంలో శశి విద్యాసంస్థల తరపున వేణుగోపాలకృష్ణ స్వయంగా సీఎం సహాయ నిధికి కోటి రూపాయల విరాళం అందించారు.

జిల్లా ఉత్తమ టీచర్ ప్రసన్నదుర్గకు అభినందనలు



అవార్డు స్వీకరిస్తున్న బొబ్బిలి ప్రసన్న దుర్గ

ఆకివీడురూరల్ సెప్టెంబరు 6 : సిద్ధాపురం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని బొబ్బిలి ప్రసన్నదుర్గ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక య్యారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీమ్ అస్మి, డీఈవో నాగమణి చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. మండలం నుంచి నలుగురు అవార్డులు అందుకున్న వారిలో పి.కిషోర్, ఆకివీడు, ఎం.బలరాముడు, పెదకాపవరం, వి.కిషోర్, చినకాపవరం ఉన్నారు. జడ్పీటీసీ యండగండి శ్రీను, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు మోటుపల్లి రామవరప్రసాదు, మోటుపల్లి గంగాధరరావు, సిద్దాపురం సర్పంచ్ చిట్టిబాబు, ఉపసర్పంచ్ నారాయణరాజు, భూపతిరాజు తిమ్మరాజు, కలిదిండి ఇంద్రరాజు, నౌకట్ల రామారావు, కేశిరెడ్డి దిలీప్ స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా గణేష్ బాధ్యతలు

ఆకివీడు, సెప్టెంబరు 6 : సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డెంటల్ డాక్టర్ అచ్యుత్ గణేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వైద్యురాలు ఎండీ నజ్రీన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. సీనియారిటీ ప్రకారం గణేష్‌కు బాధ్యతలు అందించామని డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ తెలిపారు. గణేష్‌కు వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సొసైటీలో విచారణకు నోటీసులు సిద్ధం

మొగల్తూరు : మొగల్తూరు సహకార సంఘంలో 51వ విచారణకు గత ప్రభుత్వం ఇచ్చిన స్టేని కూటమి ప్రభుత్వం ఉపసంహరించడంతో తిరిగి 51వ విచారణ చేసేందుకు విచారణ అధికారులు సంఘ సభ్యులకు నోటీసులు శుక్రవారం సిద్ధం చేశారు. విచారణాధికారిగా నియమితులైన జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 2017 నుంచి సంఘంలో జరిగిన కార్యకలాపాల మొత్తాన్ని విచారణ చేయాల్సి ఉందన్నారు. గతంలో కొంతమంది సంఘ సభ్యులకు నోటీసులు అందించామని, ప్రభుత్వం నుంచి స్టే రావడంతో విచారణ నిలిచిందన్నారు. ఇటీవల ప్రభుత్వం స్టే ఉపసంహరించుకుని మళ్లీ ఆదేశాలు ఇచ్చిందని, సుమారు రెండు నెలలు ఈ విచారణ జరిగే అవకాశం ఉందన్నారు.

డివిజనల్ రైల్వే కమిటీ సభ్యుడిగా చంద్రమోహన్

ఆకివీడు, సెప్టెంబరు 6 : డివిజనల్ రైల్వే యూజర్ కన్సల్టేట్ కమిటీ సభ్యుడిగా వాడపల్లి చంద్రమోహన్ నియమితులయ్యారు. డీఆర్ఎం నుంచి అందుకున్న పత్రాన్ని శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ వి.మాణిక్యం విలేకరులకు తెలిపారు. గత పదేళ్ళుగా అనేక సంస్థలో బాధ్యతలు చేపట్టి సక్రమంగా విధులు నిర్వహించినందుకు డివిజన్ రైల్వే గుర్తించి తనకు ఈపదవి కట్టబెట్టిందన్నారు. స్థానిక ప్రముఖులు, రాజకీయ పార్టీ నేతలు అభినందించారు.

జ్వర బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 6: పట్టణంలో జర్వాలతో ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సుప్రజకు వినతిపత్రం అందించారు. పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, హౌస్‌సేన్ వైద్యుల్ని కలిసి పరిస్థితిని వివరించారు. ఆస్పత్రికి వచ్చే రోగులందర్ని పరీక్షించి వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైతే మందులు, వైద్యుల్ని రప్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, పి.నాగరాజు, టి.లక్ష్మీనారాయణ, కె.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువునకు లైసెన్స్ హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట ప్రకటన

పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం, కొయ్యేటిపాడు గ్రామములో వేంచేసియున్న శ్రీ హనుమ దేశ్వరస్వామి వారి దేవస్థానమునకు సంపూర్ణ హక్కు భుక్తములో ఉండియున్న ఈ దిగువ ఉదహరించిన భూమి చేపలు చెరువు త్రవ్వుకొని చేపలు పెంచుకొనుటకు ది. 01-10-2024 నుండి 30-09-2029 వరకు అనగా 5 సంవత్సరములు కాలము చేపలు పెంపకము చేసుకొను లైసెన్స్ హక్కు పొందుటకు తేది. 18.09.2024 బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ స్వామి వారి దేవస్థానము నందు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల వారి సమక్షములో సదరు దేవస్థానం కార్య నిర్వాహణాధికారి వారిచే టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించబడును. ఆసక్తిగలవారు సదరు వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ. నెం.	భూమి యొక్క గ్రామము	రి.సర్వే నెం.	పరిమితి	కౌలు కాలము	చెల్లించవలసిన ధరావత్తు
1	కొయ్యేటిపాడు	60/1	య. సెం. 1-04	01-10-2024 నుండి 30-09-2029 5 సం॥లు	10000/-

ముఖ్య షరతులు: 1) ఈ వేలం పాట హిందు దేవాదాయ ధర్మాదాయ డిపార్టమెంట్ అధికారి మంజూరు ఉత్తర్వులకు లోబడి జరుపబడును. 2) సీల్డుటెండర్లు తేది.18-09-2024వ తేదీ ఉదయం గం.10 లకు స్వీకరించబడును. 3) హెచ్చుపాటదారుడు పాట అయిన వెంటనే 1 సం॥ము శిస్తు దేవస్థానము వారికి చెల్లించే నిర్ణయము. 4) మిగిలిన షరతులు కార్యనిర్వహణాధికారి గారిని అడిగి తెలుసుకొనవలెను.

కొయ్యేటిపాడు, తేది. 05.09.2024 కార్యనిర్వహణాధికారి

చేపల చెరువు నందు చేపలు పెంపకము చేసుకొను లైసెన్సు హక్కునకు టెండరు - కం - బహిరంగ వేలం పాట ప్రకట

ప.గో.జిల్లా, ఉండి మండలం,ఉణుదుర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం మరియు శ్రీ కేశవ స్వామి వార్ల దేవస్థానముల హక్కు భుక్తములో ఉండి యున్న దిగువ సుదహరించిన భూములను హెచ్చుపాటదారుడు తన స్వంత ఖర్చున చేపల చెరువుగా మార్చుకుని, చేపలు పెంచుకొని లైసెన్స్ కాలపరిమితి అనంతరము చేపల చెరువుగానే దేవస్థానం వారికి అప్పగించు పద్ధతిన జి.ఓ.యం.యస్.నెం.866 రెవెన్యూ ఎండోమెంట్స్ (డిపార్టుమెంట్) తేది.06.06.2003 మరియు జి.ఓ.యం.యస్.నెం.426 (రెవిన్యూ ఎండోమెంట్స్-1) డిపార్టుమెంట్, తేది.9.11.2015 [illegible] తేది 17.09.2024 తేది మంగళవారం ఉదయం గం.10.00లకు శ్రీ స్వామి వారి ఆలయం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు దేవస్థానం చైర్మన్ వారిచే టెండరు - కం - బహిరంగ వేలం పాట నిర్వహించబడును. [illegible]

వ. నెం.	దేవస్థానం పేరు	భూమియున్న గ్రామం	రీ.సర్వే.నెం.	విస్తీర్ణం య.సెం.	ప్రథమ ధరావత్తు మొత్తం రూ.
1	శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం	ఉణుదుర్రు	306/1ఎ	$1.17_{1/2}$	25000/-
2	శ్రీ కేశవ స్వామి వారి దేవస్థానం	ఉణుదుర్రు	306/1బి	$1.17_{1/2}$	
			మొత్తం	2.35	

ముఖ్య షరతులు:1) హెచ్చుపాటదారుడు పాట పూర్తి అయిన వెంటనే ఒక సంవత్సరము శిస్తు మొత్తము దేవస్థానం వార్కి చెల్లించు నిర్ణయం. 2)పాటలో పాల్గొన దలచిన వారు ముందు ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీని సమర్పించవలెను. [illegible] 3) మిగిలిన పాట షరతులు దేవస్థానం చైర్మన్ వారిని అడిగి తెలుసుకొనవలెను.

గ్రామం:ఉణుదుర్రు
తేది :06.09.2024

నడింపల్లి నరశింహరాజు, చైర్మన్, శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం

వాసాభక్తుల రామభద్రరావు, చైర్మన్, శ్రీ కేశవ స్వామి వారి దేవస్థానం



నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, మంతెన సీతారాం, పి.మధు, వెంకటేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, బి.బలరాం తదితరులు

ఆర్‌ఎస్‌కు కన్నీటి వీడ్కోలు

స్వగ్రామం చించినాడలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

యలమంచిలి, సెప్టెంబరు 6: సీపీఎం ఉమ్మడి జిల్లాల పోరాటాల రథసారథి, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) అంత్యక్రియలు ఆయన స్వగ్రామం చించినాడ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. ఆర్‌ఎస్‌కు సీపీఎం నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన భౌతికకాయాన్ని భీమవరం నుంచి గురువారం రాత్రి ఆయన స్వగృహానికి తరలించి ప్రజల సందర్శనార్థం శుక్రవారం ఉదయం11 గంటల వరకూ ఉంచారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మధు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, మాజీ ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, దిగుపాటి రాజగోపాల్, నరసాపురం టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి.తులసీదాస్, సీపీఎం కార్యకర్తలు, గ్రామస్తులు ఆర్‌ఎస్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చించినాడ గ్రామ వీధుల్లో అంతిమయాత్ర నిర్వహించారు. వశిష్ట గోదావరి ఒడ్డున ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్.ఎస్.కు అత్యంత సన్నిహితుడు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అంత్యక్రియలు జరిపారు. సీపీఎం సభ్యులు వై.వెంకటేశ్వర రావు, ఉమామహేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు బి.బలరాం, ఎ.రవి, కేతా సూర్యారావు, కానేటి బాలరాజు, బాతిరెడ్డి జార్జి, తెన్నేటి స్టాలిన్, దేవ సుధాకర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



ప్రతాప్‌రెడ్డితో చర్చిస్తున్న 'అపుస్మా' జిల్లా నాయకులు

నమ్మకం కలిగిస్తేనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్పెషలాఫీసర్ ప్రతాప్‌రెడ్డి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 6 : ప్రభుత్వ పాఠ శాలలపై ప్రజలకు నమ్మకం కలిగిస్తేనే భవిష్యత్తులో వాటి మనుగడ ఉంటుందని, ఇందుకు ఉపాధ్యాయులే బాధ్యతలు తీసుకోవాలని రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్, విద్యా కార్య క్రమాల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేకాధికారి ప్రతాప్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఏలూరు ఎంఈవో కార్యాలయ మీటింగ్ హాలులో జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా తీసుకునే యూ-డైస్ ప్లస్ డేటాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, సీడబ్ల్యుఎస్ఎన్ పిల్లల వివరాలు తదితర అంశాలన్నీ నూరుశాతం పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. నాడు-నేడు కార్యక్రమంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. పెండింగ్‌లో వున్న పనులకు అవసరమైన నిధుల గురించి వివరాలను డీఈవోకు అందజేయాలని, ఇప్పటికీ నిధులున్న పాఠశాలల్లో తక్షణమే మిగిలివున్న పనులను పూర్తిచేయాలన్నారు. ఉమ్మడి జిల్లాకు పీఎం-శ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన ల్యాబ్‌లు, ప్రహరీగోడల నిర్మాణపనులను వెంటనే పూర్తిచేయాలని కోరారు. అనంతరం వ్యాయామోపాధ్యాయులతో సమావేశ మయ్యారు. డీఈవో అబ్రహం, అసిస్టెంట్ డైరెక్టర్లు అవధాని, షరీఫ్, సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లోనూ ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు

ప్రభుత్వం నిర్దేశించిన కేలండర్ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లోనూ అన్ని పరీక్షలను నిర్వహించడంతో పాటు, విద్యార్థులు సాధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందేనని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా స్పెషలాఫీసర్ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఏలూరు విచ్చేసిన ప్రతాప్‌రెడ్డి డీఈవో కార్యాలయంలో ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించరాదని, విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌నైనా నిర్వహించాల్సిందేనని ఆదేశించారు. పదో తరగతి హిందీ సబ్జెక్టు సిలబస్ విషయమై ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. 'అపుస్మా' నాయకులు డాక్టర్ ఎంబీఎస్ శర్మ మాట్లాడుతూ పదో తరగతి హిందీ, సోషల్ స్టడీస్ సిలబస్ చాలా ఎక్కువగా ఉందని, గత విద్యా సంవత్సరం సిలబస్‌తో పోల్చితే ఒకటిన్నర రెట్లు ప్రశ్నలు అధికంగా ఉన్నాయని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. 'అపుస్మా' జిల్లా కార్యదర్శి ఎస్.ఆర్.కే.ఎ.ప్రసాద్, ఏలూరు, దెందులూరు, నూజివీడు జోన్ల నాయకులు వెంకటేశ్వరరావు, సతీష్, మోహనరావు, శేఖర్, తంబి, తదితరులున్నారు.

ఐదు గంటల ఆలస్యంగా లింగంపల్లి ఎక్స్‌ప్రెస్

నరసాపురం, సెప్టెంబరు 6: నరసాపురం నుంచి లింగంపల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఐదు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం 6.55కి బయలు దేరాల్సి ఉండగా రాత్రి 11.55కి బయలు దేరుతున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలు ఆలస్యానికి కారణమని సమాచారం. ఉదయం 8.50కు రావాల్సిన నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 7.30కు వచ్చింది. ఈ రైలుకే నిర్వహణ పనులు చేపట్టి లింగంపల్లికి పంపాల్సి ఉంది. దీంతో నిర్వహణ పనులకు ఐదు గంటలు పట్టడంతో లింగంపల్లి ఆలస్యంగా బయలు దేరింది. ప్రయాణికులు స్టేషన్‌లో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 6: ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను శుక్ర వారం ద్వారకాతిరుమల పోలీ సులు అడ్డుకున్నారు. ఒక జేసీబీ, ట్రాక్టరును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తర లించారు. గ్రామంలోని చెరువులో స్థానికుడు ఒకరు కొద్దిరోజులుగా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నాడు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ మట్టి రూ.500 నుంచి రూ.700 వరకూ విక్రయిస్తున్నాడు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా తీరుమారలేదు. దీంతో ఎస్ఐ సుధీర్ అక్కడకు వెళ్లి మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తొలి పూజకు వేళాయె..

వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

మార్కెట్‌లో ధరాఘాతం



ఏలూరు సిటీ/ భీమవరం టౌన్/నరసాపురం / ఆచంట/ పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 6:

వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవా సర్వకార్యేషు సర్వదా..

గణనాథుని పూజకు వేళయింది. ఎప్పుడూ తొలి పూజ గణపతిదే. వినాయకుడిని కొలిస్తే సర్వ శుభాలు కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. గణనాథునికి తొలిపూజ చేయాలని దేవతలు కూడా భావించారు. అందుకే హైందవ సంప్రదాయంలో వినాయక చవితి పండుగకు అత్యంత ప్రాధాన్యం ఉంది. వినాయకచవితి ఉత్సవాలకు వాడవాడలా నిర్వహిస్తుంటారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలో రామకోటి సెంటర్, కుండీల సెంటర్, కూరగాయల మార్కెట్‌ల 18 నుంచి 20 అడుగుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి దాదాపు ఆరునెలలపాటు ఇక్కడే ఉండి పీవోపీ, మట్టి విగ్రహాలను తయారు చేస్తుంటారు. పర్యావరణ హితంగా వేడుకలు నిర్వహించాలనే ప్రచారంతో మట్టి విగ్రహాలే ఎక్కువగా కొనుగోళ్ళు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి చవితి సందడి పెరిగినా విగ్రహాలు అంతంత మాత్రంగానే అమ్ముడవుతున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. విగ్రహాల ధరలు కూడా గతంతో పోలిస్తే పెరిగాయి. దీంతో చాలా మంది తక్కువ ఎత్తులో విగ్రహాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. భీమవరంలో పంచారామ క్షేత్రమైన సోమేశ్వరస్వామిఆలయం వద్ద, తణుకు విశ్వేశ్వరస్వామి దేవస్థానం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపరం తదితర పట్టణాల్లో కూడా చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు భారీగా ఏర్పాటు చేశారు. నరసాపురం మెయిన్‌రోడ్ కళకళలాడింది. వైఎస్ఆర్ విగ్రహం నుంచి శివాలయం వరకు తోపుడు బండ్లపై వందల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇటు పూవ్వులు, పండ్ల దుకాణాల వద్ద కూడా రద్దీ కనిపించింది. కిరాణ, బట్టల షాపులు కళకళలాడాయి.ఆచంట కచేరి సెంటర్ సందడిగా మారింది. మధ్యాహ్నం వరకు అంతంతమాత్రంగా ఉన్న సెంటర్ సాయంత్రం నుంచి కొనుగోలు చేసేందుకు ఎక్కువ సంఖ్యలో రావడంతో కచేరి సెంటర్ ఆయా దుకాణాల వద్ద కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయింది. పాలకొల్లులో ఉదయం నుంచి రాత్రి వరకూ మార్కెట్ అంతా రద్దీగా కనపడింది.

అల్పపీడన ప్రభావం

ఈసారి వినాయక చవితి పండుగపై అల్పపీడన ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల భారీగా వర్షాలు కురిసినా గురువారం కొంత వర్షం శాంతించింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మబ్బుల వాతావరణం ఏర్పడింది. అంతేగాక శనివారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చ రికలు జారీ చేయడంతో నిర్వాహకులు ఉత్సవాలు ఎలా నిర్వహించా లన్న మీమాంశలో పడ్డారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో భారీ వర్షం కురవటంతో వ్యాపారస్తులు కంగుతిన్నారు. సరుకులు సర్దుకునేందుకు ఎటువంటి అవకాశం లేకుండా దాదాపు 20 నిమిషాల పాటు ఏకధాటిగా వర్షం కురువడంతో అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపింది

ధరాఘాతం

పూలు, పండ్లు, చవితి పత్రి , ఇతర సామాగ్రి ధరలకు రెక్క లొచ్చాయి. గతంతో పోలిస్తే ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో చవితి వ్యాపారం మాత్రం సాధారణంగానే కొనసాగుతోంది. గురువారం సాయంత్రం నుంచే చవితి వ్యాపారులు పత్రి, పూలు, పండ్లు, పాలవెల్లి, ఇతర డెకరేషన్ సరుకులు అమ్మకాలు ప్రారంభించారు. ధరలు పెరగటంతో చాలా మంది తక్కువగానే కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతో వర్షంలోనే పూజా సామాగ్రిని కొనుగోలు చేస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు మట్టి విగ్రహాలను, వినాయక వ్రతకల్పం పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నారు.



వానలోనే ఏలూరులో మండపం వద్ద డెకరేషన్ పనులు

చవితి చందా.. దందా !

నిడమర్రు సెప్టెంబరు 6: చవితి చందాల దందాలు హద్దులు మీరుతున్నాయి. భక్తి శ్రద్ధలతో నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో విపరీత పోకడలు చోటుచేసుకొంటున్నాయని సామాన్య భక్తులు ఆవేదన చెందుతున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజలలో ఐక్యతా భావం పెంపొందించడం కోసం బాలగంగాధర్ తిలక్ సామూహిక గణేష్ మహోత్సవాలు నిర్వహించేవారు. నేడు వీధికో విగ్రహం, కులాలు, వర్గాల వారీగా విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ నాయకులు తమ బల ప్రదర్శన కోసం ఈ గణేష్ ఉత్సవాలను వేదికగా చేసుకోవడం విడ్డూరం. భక్తి కన్నా బలప్రదర్శన ఎక్కువ కనబడుతోందని సంప్రదాయ వాదులు వాపోతున్నారు. కమిటీ కర్రోళ్ళు ఒకరిని చూసి మరొకరు పోటీ పడి ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహం సైజు మొదలు, మండపం అలంకరణ, లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు ఏర్పాట్లు ఇలా అన్నింటిలోనూ పోటీ పడుతున్నారు. అన్నదానాల్లో కూడా పోటీలు పెరిగి మేము 13 రకాల స్వీట్లు పెట్టామని, మేము 8 రకాల కూరలు పెట్టామంటూ గొప్పలు చెప్పుకొంటున్నారు. వీటికోసం పోటీలు పడి భారీ ఎత్తున చందాలు వసూలు చేస్తున్నారు. చివరకు ఇది ఒక దందాలా తయారైందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. రోజుకు 5 నుంచి 10 మంది ఉత్సవకమిటీ వాళ్లు వస్తున్నారని వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్న ఊరులోనే కాకుండా పక్క ఊర్లకు వెళ్లి చందాలు వసూలు చేస్తున్నారు.



పాలకొల్లులో పూజా సామగ్రి అమ్మకాలు





ఏలూరులో వర్షంలోనే పూజా సామగ్రి కొనుగోళ్లు



భీమవరంలో జోరువానలో మార్కెట్..

రాష్ట్రస్థాయి పోటీలకు కైకరం విద్యార్థులు



ఉంగుటూరు, సెప్టెంబరు 6 : కైకరం హైస్కూలు విద్యార్థులు అండర్-16 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపి కైనట్లు ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు తెలిపారు. శుక్ర వారం హైస్కూలులో ఎంపికైన విద్యార్థులు వండాని పవన్ కుమార్, గాలింకి లావణ్యలను ప్రశంసించారు. పి.డి.లు జి.నాగ సుధ, .పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్, కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గురుకుల విద్యాలయంలో ఎంపిక పోటీలు

పెదవేగి, సెప్టెంబరు 6 : నిత్యసాధన, నిరంతర శ్రమ విద్యార్థి అభివృద్ధికి చిహ్నమని పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఈనెల 21వ తేదీవరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) 19 ఏళ్ళ విభాగం క్రీడా జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం ఉదయం ప్రారంభించారు. బాలురకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్,ఖోఖో, బాల్ బాడ్మింటన్, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని పీడీ కె.జయరాజు తెలిపారు. విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యులు, పీఈటీ గురుమూర్తి, ఇతర కళా శాలల నుంచి వచ్చిన పీడీలు శ్రీనివాసరావు, నాగమణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బైట్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



పాలకోడేరు, సెప్టెంబరు 6: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలలో పెన్నాడ బైట్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ తెలిపారు. 2017 నుంచి ప్రధాని నరేంద్రమోడీ పిలుపుతో కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం పోటీలను నిర్వహిస్తూ వస్తుంది. ఈ ఏడాది 18 విభాగాలలో 275 సమస్య లను కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు గుర్తించాయన్నారు. ఆ సమస్యలకు విద్యార్థులు తమ ఆలోచన శక్తితో పరిష్కారాలను కనుగొనాలని తెలిపారు.తమ కళాశాలలో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మా బిడ్డను బతికించండి

ప్రభుత్వాన్ని వేడుకుంటున్న తల్లిదండ్రులు

గుండె చుట్టూ పెరిగిన కండరాలు

శ్వాస తీసుకోవడం కష్టం కావడంతో అత్యవసర చికిత్స

వైద్యానికి రూ. 5 లక్షలు పైనే ఖర్చు



రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక గోగుల మౌనిక.. పక్కన (ఫైల్‌ఫొటో)

బుట్టాయగూడెం, సెప్టెంబరు 6 : ఈ చిన్నారి పేరు మౌనిక. వయసు 13 ఏళ్లు. ఊరు బుట్టాయగూడెం మండలం లంక పాకల. కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది.బుధవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా ఊపిరి తీసుకోవడం కష్టం కావడంతో తల్లిదండ్రులు ఆమెను రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు పరీక్షించి గుండె చుట్టూ కండరాలు పెరగడంతో శ్వాస తీసుకోవడం కష్టంగా వుందని నిర్ధారించారు. ఆమెకు అత్యవసర వైద్యం అందించాలని, ఇందుకు ఏడు నుంచి ఎనిమిది ఇంజక్షన్లు చేయాల్సి వుందని అయితే ఒక్కో ఇంజక్షన్ ఖరీదు వేలల్లో వుంటుందని స్పష్టం చేశారు. ఈ వైద్యానికి సుమారు ఐదు లక్షలు పైనే ఖర్చు అవుతుందని చెప్పారు. అయితే అంత ఖర్చు పెట్టే స్థోమత తమకు లేదని కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు గోగుల చిన్నయ్య, సంధ్య వాపోతున్నారు. కొండరెడ్లమైన తాము పాపే ప్రాణంగా బతుకు తున్నా మని, ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి తమ బిడ్డకు ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించాలని కోరుతున్నారు.ఆదివాసీల కోసమే పనిచేస్తున్నామని చెప్పుకునే ఐటీడీఏ అధికారులు ఈ బిడ్డకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ డిమాండ్ చేశారు.

పూళ్ళలో డెంగీతో విద్యార్థిని మృతి



భీమడోలు, సెప్టెంబరు 6 : భీమడోలు మండలం పూళ్ళ జిల్లా పరిషత్ హైస్కూలులో పదవ తరగతి చదువుతున్న పేదాడ మీనాక్షికి డెంగీ జ్వరం సోకి చికిత్స పొందుతూ మృతి చెందింది. నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న మీనాక్షి ఏలూరు ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందినట్లు జిల్లా పరిషత్ హైస్కూలు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని మృతి పట్ల హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.



ఆచంటలోజరిగిన సామాజిక తనిఖీ సభలో అధికారులను వివరాలు అడుగుతున్న కొడమంచిలి కూటమి సభ్యులు

ఉపాధి పనుల్లో అవకతవకలు

రూ.5 లక్షలు పైనే గోల్‌మాల్

ఆచంట, సెప్టెంబరు 6 :జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఆచంట మండలంలో 2023 -24 సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులపై గ్రామసభలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలం మొత్తం మీద 1367 పనులకు గాను 6 కోట్ల 67 లక్షల 66 వేల 360 రూపాయలు ఖర్చు పెట్టగా దీనిలో 5 లక్షల 14 వేల 342 రూపాయలు నిధులు అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనిలో కొడమంచిలిలో ఏకంగా ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌పై 4 లక్షల 94 వేల 126 రూపాయలు బినామీ మస్తర్‌లు వేసి సొమ్ములు గోల్‌మాల్ చేసినట్లు అధికారులు గుర్తించారు. అలాగే 3 లక్షల 11 వేల 183 రూపాయలకు సంబంధించి వేత న దారులకు తిరిగి చెల్లించాల్సి ఉందని కోడేరులో ఎస్ఎస్ఏ ద్వారా నిర్మించిన కాంపౌండ్‌వాల్‌కు సంబంధించి రూ. 2లక్షల 12 వేల 124 రూపాయలు విచారణ చేయాల్సి ఉందని అధికారులు గుర్తించారు. అవకతవలకు సంబంధించి కొడమంచిలి ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు మండలంలో గతంలో చేసిన టెక్నికల్ అసిస్టెంట్‌పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ నారాయణ, ఎంపీడీవో నర్సింహ ప్రసాద్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపీపీలు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ గోవిందరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తాళాలు పగులగొట్టి చోరీ

ముదినేపల్లి, సెప్టెంబరు 6 : ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో రిటైర్డ్ హెచ్ఎం మారగాని మారయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఆయన మూడు నెలలుగా అమెరికాలోని తన కుమారుడి వద్ద ఉంటున్నారు. ఇంటి తాళం పగులకొట్టి ఉండటాన్ని రైతు చూసి గ్రామంలోని మారయ్య బంధువులకు తెలపడంతో వారు ఇంటిలోకి వెళ్లి చూడగా మిక్సీ, ఇన్వర్టర్, బ్యాటరీ తదితర వస్తువులు అపహరించినట్లు పోలీసులకు తెలిపారు. సుమారు రూ.45 వేల విలువైన పరికరాలు పోయినట్లు గుర్తించారు. అమెరికా నుంచి ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు పంపారు.

క్రైం కార్నర్..

పోక్సో కేసులో జీవిత ఖైదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6 : బాలిక పట్ల లైంగిక దాడికి పాల్పడి అత్యాచారం చేసినట్లు ఒక యువకుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు, ఐదు వేల రూపాయల జరిమానా బాధితు రాలికి మూడు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సునంద శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామానికి చెందిన చెమటపాము రమేష్ (20) 2014 ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పారిపోయాడు. బాలిక తల్లితో జరిగిన సంఘటన చెప్పడంతో తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి అప్పటి చింతలపూడి సీఐ వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, జంగా రెడ్డిగూడెం ఇన్‌స్పెక్టర్ రాజేష్, హెడ్ కానిస్టేబుల్ కొండలరావు కోర్టు మానిటరింగ్ బృందం సహకరించారు.

ఆటో డ్రైవర్ అసభ్య ప్రవర్తన.. పోక్సో కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6 :ఆటోలో స్కూలుకు తీసుకు వెళ్తూ విద్యార్థిని పట్ల ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించడంతో అతనిపై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన విద్యార్థిని నగరంలోని ఒక పాఠశాలలో చదువుతోంది. ఆటో డ్రైవర్ యాదం దుర్గారావు (28) వారం రోజుల నుంచి ఆ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఆటోలో వెళ్ళనని ఏడ్వడంతో తల్లి విషయం తెలుసుకుని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలంపురం కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

పెంటపాడు, సెప్టెంబరు 6 :అలంపురం మిడ్‌లెవిల్ కాలువలో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం మొత్తం పాడై గుర్తుపట్టని రీతిలో ఉందని ప్యాంటు ఉండటంతో పురుషుడిగా గుర్తించా మన్నారు. ప్రస్తుతం మృతదేహానికి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

షాపులో చోరీ.. రూ.4 లక్షలు అపహరణ

కొయ్యలగూడెం, సెప్టెంబరు 6: మండలంలోని పొంగుటూరు గ్రామంలో వ్యాపార వేత్త కొల్లూరు సత్తిబాబు షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపులో ఉన్న రూ.4 లక్షల నగదును దొంగలు అపహరించారు. అంతే కాకుండా సీసీ కెమెరాల డేటా బాక్సును కూడా పట్టికెళ్ళారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సత్తిబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 6: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నిట్టా మరియమ్మ (53) స్థానిక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వద్ద చిన్న హోటల్ నిర్వహిస్తోంది. దుకాణంలో ఉన్న ఫ్రిజ్ నుంచి పదార్థాలను బయటకు తీసుకునేందుకు డోర్‌ను పట్టుకోగా విద్యుత్ షాక్ కొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఈమె కుటుంబ సభ్యులకు అక్కడి వారు సమాచారం ఇవ్వడంతో ద్వారకాతిరుమల పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు.

ఆటో బోల్తా..9 మంది కూలీలకు గాయాలు




నూజివీడు టౌన్, సెప్టెంబరు 6: జామ కాయల కోతకు కూలీలను తరలిస్తున్న ఆటో పల్టీ కొట్టిన ఘటనలో 9 మంది కూలీలు గాయాలపాలైన ఘటన నూజివీడులో చోటు చేసుకుంది. ఎమ్మార్ అప్పారావు కాలనీ నుంచి 9 మంది కూలీలతో వెళుతున్న ఆటో భారత్ క్లే ప్రోడక్ట్స్ వద్ద పల్టీ కొట్టడంతో రొంగలి చంద్రమ్మ, సప్పా నారాయణమ్మ, బల్లారమ్మ, రొంగలి పెద్దమ్మ, చిట్టూరి కోటేశ్వరమ్మ, ఉష, స్వర్ణమ్మ, షేక్ నాగూర్‌బీ, గౌరీలు గాయాలపాలయ్యారు. వీరిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పగలు హోటల్ నిర్వహణ..రాత్రి చోరీలు

మహిళ అరెస్టు

70 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6 :హోటల్ నిర్వహించడం వృత్తిగా కొనసాగిస్తున్న ఒక మహిళ తాళాలు వేసి ఉన్న ఇళ్ళల్లో చోరీలు చేయడం తన ప్రవృత్తిగా చేసుకుంది. చివరకు పోలీసులు నిఘా పెట్టి ఆమెను అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ శుక్రవారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మూడెడ్ల శ్రీదేవి (30) చిన్న హోటల్ నిర్వహిస్తున్నది. విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు దొంగతనాలు మార్గంగా ఎంచుకుంది. గత నెలలో అదే గ్రామంలో ఒక ఇంటికి తాళాలు వేసి ఉండగా ఆ ఇంటి తాళాలు పగులగొట్టి పది గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించింది. ఈ నెల మూడో తేదీన మరో ఇంటి తాళాలు పగులగొట్టి 60 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించింది. ఆ ప్రాంతంలో దొంగ తనాలు జరుగుతున్న సంఘటనపై భీమడోలు సీఐ రవికుమార్ పర్య వేక్షణలో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం గుండుగొలను గ్రామంలోని బెయిలీ బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీదేవి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఆమె వద్ద 70 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తించారు. వాటి విలువ నాలుగు లక్షల 47 వేల రూపాయలని దీంతో ఆమెను అరెస్టు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నట్లుగా డీఎస్పీ చెప్పారు.